క్లుప్తంగా

సేవామార్గంలో వ్యర్థాల డంపింగ్‌పై జెడ్సీ ఆగ్రహం



వ్యర్థాలు డంప్ చేసిన వారికి అవగాహన కల్పిస్తున్న జెడ్సీ రాము

మల్కాపురం : జోన్–5 జెడ్సీ రాము గురువారం 59వ వార్డులో ఆకస్మికంగా పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. సైనిక కాలనీ వద్ద అంబేడ్కర్ విగ్రహం ప్రాంతంలో పర్యటిస్తుండగా, కొందరు తమ ఇంటి వ్యర్థాలను సేవా మార్గంలో నిర్లక్ష్యంగా డంప్ చేస్తున్నట్లు గుర్తించారు. వారిని మందలించిన జెడ్సీ రాము, పారిశుద్ధ్య కార్మికులకు వ్యర్థాలు ఇవ్వాలని, అలా కాకుండా సేవా మార్గంలో డంప్ చేస్తే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని హెచ్చరించారు. మరోసారి ఇలా చేస్తే జరిమానాలు తప్పవని స్పష్టం చేశారు. అనంతరం స్థానికులకు వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు. కొండ ప్రాంతంలోనూ పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జోన్–5 అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్, మలేరియా అధికారి డి. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత



సింహాచలం కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు లక్ష్మీనగర్‌కు చెందిన ఎన్. సింహాచలం కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.1.44 లక్షల విలువైన చెక్కును ప్రభుత్వ విప్ గణబాబు అందజేశారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ ఇటీవల అనారోగ్యానికి గురైన సింహాచలం కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని తెలుసుకున్నామని చెప్పారు. వారి తరఫున సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయగా నిధులు మంజూరయ్యాయని ఆయన తెలిపారు.

వ్యర్థాల తొలగింపులో నిర్లక్ష్యం వద్దు



పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్

మల్కాపురం: వ్యర్థాల తొలగింపులో నిర్లక్ష్యం పనికిరాదని, సకాలంలో వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జోన్–5 అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీల్ స్పష్టం చేశారు. 60వ వార్డు గుల్లలపాలెం మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ వెనుక ఉన్న వార్డు పారిశుద్ధ్య అధికారి కార్యాలయం వద్ద వార్డు ప్రాంత పారిశుద్ధ్య కార్మికులతో ఆయన మాట్లాడారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ సునీల్ మాట్లాడుతూ, కేవలం తమ పరిధులకు మాత్రమే పరిమితం కాకుండా, ప్రజలు ఎక్కడ ఇబ్బంది పడుతున్నారో తెలిస్తే వెంటనే స్పందించి అక్కడ వ్యర్థాలు లేకుండా చూడాలని సూచించారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సతీష్ యాదవ్, మలేరియా అధికారి డి. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికునికి తీవ్ర గాయాలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్–3 విభాగంలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్న పిట్టా నూకరాజు తీవ్రంగా గాయపడ్డారు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం, పిట్టవానిపాలేనికి చెందిన నూకరాజు గురువారం జనరల్ షిఫ్ట్‌లో విధులకు హాజరయ్యేందుకు బయలుదేరారు. బీఎఫ్–3 నుంచి ఎస్.ఎం.ఎస్–2కు వెళ్లే రైల్వే ట్రాక్ పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్ దాటుతుండగా అతని కాలు ట్రాక్ స్లీపర్ల మధ్యలో ఇరుక్కుపోయింది. ఈ ప్రమాదంలో నూకరాజు ఎడమ చేయి, ఎడమ చెవి, నడుము, మెడ భాగాలలో తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న లోకో సిబ్బంది ఈ ప్రమాదాన్ని గుర్తించి వెంటనే అధికారులకు సమాచారం అందించారు. అధికారులు తక్షణమే స్పందించి నూకరాజుకు ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం గాజువాకలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.



ఇరుకు గదిలోనే వైద్య పరీక్షల కోసం నిరీక్షిస్తున్న రోగులు

యూపీహెచ్‌సీకి సుస్తీ





ప్రమాదభరితంగా ఇంకుడు గుంత



ఆర్పీపేట ప్రజాపట్టణ ఆరోగ్య కేంద్రం అదనపు భవనం



ప్రారంభానికి నోచుకోని అదనపు గదులు



అధ్వానంగా వైద్య కేంద్రం పరిసరాలు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధిలోని రామ్మూర్తిపంతులుపేట ప్రాథమిక పట్టణ ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) రోగులకు నరకంగా మారింది. ఇరుకు గదుల్లోనే వైద్య సేవలు అందుతుండటంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం సుమారు 95 నుంచి 140 మంది ఔట్ పేషెంట్లు వస్తున్న ఈ కేంద్రంలో స్థలం చాలకపోవడంతో వైద్య సిబ్బంది సైతం ఇబ్బంది పడుతున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన రూ. 47.80 లక్షలతో నిర్మించిన అదనపు భవనం ఎన్నికల కోడ్ కారణంగా ప్రారంభానికి నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా భవనం తెరుచుకోకపోవడంతో రోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరుకు గదుల్లో అన్ని రకాల రోగాలకు పరీక్షలు చేస్తుండటంతో రోగుల బంధువులు, వైద్య సిబ్బంది కొత్త రోగాల బారిన పడే ప్రమాదం ఉందని వాపోతున్నారు. అదనపు భవనం ప్రారంభించాలని ఎన్నోసార్లు కోరినా పట్టించుకునేవారు లేరని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిరుపయోగంగా నిధులు

పదమూడేళ్ల క్రితం నిర్మించిన ఈ డిస్పెన్సరీ పెరుగుతున్న జనాభాకు సరిపోవడం లేదు. దీంతో గత ప్రభుత్వం అదనపు భవనానికి నిధులు మంజూరు చేసి ఏడాదిలోనే నిర్మాణం పూర్తి చేసింది. అయితే, ప్రారంభ సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో భవనం మూతపడింది.

సమన్వయ లోపమే శాపం

అదనపు భవనం ప్రారంభించాలని రోగులు, వైద్య సిబ్బంది మొర పెట్టుకున్నా ఫలితం లేదు. వైద్యాధికారిణి ఉన్నతాధికారుల నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నామని చెప్పగా, ఇంజినీరింగ్ అధికారులు భవనాన్ని డీఎంహెచ్‌వోకు అప్పగించామని తెలిపారు. హెల్త్ అధికారులు మాత్రం ప్రజాప్రతినిధుల చేతుల్లో ఉందని పేర్కొంటున్నారు. దీంతో సిద్ధంగా ఉన్న భవనాన్ని ప్రారంభించడంలో జాప్యం జరుగుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తూతూ మంత్రంగా సేవలు

ఆర్పీపేట యూపీహెచ్‌సీలో ప్రధాన వైద్యాధికారిణి బదిలీ కావడంతో వైద్య సిబ్బంది కొరత ఏర్పడింది. ఉన్న కొద్దిమంది సిబ్బందితోనే నామమాత్రపు వైద్య సేవలు అందిస్తున్నారు. సిబ్బంది కొరతపై ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. పనిచేయలేమని సిబ్బంది సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అదనపు భవనాన్ని ప్రారంభించి, వైద్యులను, వైద్య సిబ్బందిని నియమించాలని రోగులు కోరుతున్నారు.

తీవ్ర అసౌకర్యం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది ఇరుకు గదుల్లోనే రోగులకు సేవలు అందించాల్సిన దుస్థితి నెలకొంది. అదనపు భవనం నిర్మించి ఏడాది గడుస్తున్నా ప్రారంభించకపోవడంతో, రోగాలతో వైద్యం కోసం వచ్చే వారికి కొత్త వ్యాధులు అంటుకునే ప్రమాదం పొంచి ఉంది. రక్త పరీక్షలు చేసే గది, మందులు ఇచ్చే ప్రదేశం, ఓపీ నమోదు కార్యాలయం అన్నీ ఒకే చోట ఉండటంతో తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. తిరిగి వెళ్లేటప్పుడు ఎలాంటి వ్యాధులు అంటుకుంటాయోనని ఆందోళన చెందుతున్నాం. – జి. గీతాకుమారి, దుర్గానగర్, కంచరపాలెం

అధికారులు స్పందించాలి

గత ప్రభుత్వంలో అధిక నిధులు వెచ్చించి నిర్మించిన అదనపు భవనాన్ని నెలలు గడుస్తున్నా ప్రారంభించకపోవడం దారుణం. వైద్యులు లేకుండానే వైద్య సేవలు అందిస్తున్నారు. ఉన్న సిబ్బంది రోగులతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి, భవనం ప్రారంభమయ్యేలా చూడాలి. సంబంధిత అధికారులు ఈ విషయంపై తక్షణ చర్యలు తీసుకోవాలి. –వెంకటరావు, రామూర్తిపంతులుపేట, కంచరపాలెం

సీసీ రోడ్డు ప్రారంభం



కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ గులిగిందల లావణ్య తదితరులు

మల్కాపురం: ములగాడ నుంచి అలూఫ్లోరైడ్‌కు వెళ్లే మార్గానికి ఎట్టకేలకు విముక్తి లభించింది. పూర్తిగా గుంతలమయంగా ఉన్న ఈ రహదారి సమస్యను ములగాడ జాషువ గ్రామ కమిటీ సభ్యులు కార్పొరేటర్ గులిగిందల లావణ్య దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన కార్పొరేటర్ లావణ్య, అలూఫ్లోరైడ్ సంస్థ ఉన్నతాధికారులతో చర్చించి ఆ ప్రాంతంలో సీసీ రోడ్డు , సీసీ కాలువ నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. సుమారు 13 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ సీసీ రోడ్డు మరియు సీసీ కాలువను గురువారం కార్పొరేటర్ లావణ్య ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు గులిగిందల కృష్ణ, పెద్దాడ వెంకటరమణ, ధర్మాల వేణుగోపాలరెడ్డి, ఎదుర రాజు, రవి, అజేయ్, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోబరీ కేసులో నిందితుల అరెస్టు

గోపాలపట్నం: రోబరీ కేసులో నిందితులను గోపాలపట్నం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మర్రిపాలెం రైల్వే క్వార్టర్స్ ప్రాంతానికి చెందిన ఎం.అశోక్‌కుమార్ ఈ నెల 1న పాత గోపాలపట్నం ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ముగ్గురు వ్యక్తులు అడ్డగించి అతని నుంచి నగదు, సెల్‌ఫోన్‌ను దోచుకున్నారు. అశోక్ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా యల్లపువానిపాలెంకు చెందిన రావాడ ప్రసాద్ బాబు, చందనగర్‌కు చెందిన దొనూరి సాయి కుమార్ , చంద్రనగర్ తుంపాల వీధికి చెందిన సాలాది చైత్ర గోవింద్‌లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 4,000 , సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఛేదించి నిందితులను అరెస్టు చేయడంలో చొరవ చూపిన ఎస్‌ఐ తేజేశ్వరరావు, వెస్ట్ క్రైమ్ సీఐ నిమ్మకాయల శ్రీనివాసరావు, సిబ్బందిని ఏసీపీ లక్ష్మణరావు అభినందించారు.

జీవవైవిధ్యంపై పోటీలు



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

గోపాలపట్నం: విద్యార్థుల్లో ప్రకృతిపై అవగాహన పెంచడానికి ఇటువంటి పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ అన్నారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీలలో విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి సుమారు 200 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ, జీవవైవిధ్యం పట్ల విద్యార్థులకు మంచి అవగాహన ఉందని, వారి ఉత్సాహంగా పాల్గొనడమే అందుకు నిదర్శనమని చెప్పారు. ఈ జీవవైవిధ్యాన్ని కాపాడుకుంటేనే మానవ మనుగడ సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. పక్షులు, జంతువులు, చెట్లు ఒకదానిపై మరొకటి ఆధారపడి జీవించడమే జీవవైవిధ్యమని ఆయన వివరించారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు జరిగిన ఈ పోటీలలో 8వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారు. 'ప్రకృతితో సామరస్యం, సుస్థిర అభివృద్ధి' అనే అంశంపై వ్యాసరచన పోటీ, 'ప్రకృతిని–జీవవైవిధ్యాన్ని రక్షించు' అనే అంశంపై చిత్రలేఖనం పోటీ, 'ప్రపంచ జీవవైవిధ్యం –పరిరక్షణ' అనే అంశంపై క్విజ్ పోటీ నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పోటీలను ఏపీ ఎన్‌జీసీ విశాఖ జిల్లా కోఆర్డినేటర్ బాబూరావు మాస్టారు, విజయనగరం జిల్లా కోఆర్డినేటర్ వేణుగోపాల్, అనకాపల్లి జిల్లా కోఆర్డినేటర్ ఖగేష్, ప్రాంతీయ కోఆర్డినేటర్ జానకీరావుతో పాటు గోపాలపట్నం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్ పర్యవేక్షించారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



హెచ్‌పీసీఎల్ గేటు వద్ద నినాదాలు చేస్తున్న కార్మిక సంఘ నాయకులు

మల్కాపురం : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, దాని మిత్రపక్షాలు కార్మికులకు నష్టం కలిగించేలా పాలన సాగిస్తున్నాయని ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మల్కాపురం హెచ్‌పీసీఎల్ సీ గేటు వద్ద బీజేపీ, మిత్రపక్షాల ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ, కార్మికులకు నష్టం కలిగించే నాలుగు కార్మిక కోడ్‌లను తీసుకురావడం వల్ల కార్మికులు అన్యాయానికి గురవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల నోట్లో మట్టి కొడుతూ కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాసేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. సీఐటీయూ జిల్లా నాయకుడు లక్ష్మణమూర్తి, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్, ఏఐటీయూసీ నాయకుడు కసిరెడ్డి సత్యనారాయణ, రామచంద్రరావు మాట్లాడుతూ కేంద్రం తీసుకున్న నిర్ణయాల వల్ల యాజమాన్యం చెప్పిందే న్యాయం, వారి చెప్పిందే తీర్పు అన్నట్లుగా పరిస్థితులున్నయన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పైడిరాజు, తాతబాబు, పెద్దాడ కుంచారావు తదితరులు పాల్గొన్నారు.

కళాకారులను ప్రోత్సహించాలి



కళాకారిణి రత్నశ్రీని సత్కరిస్తున్న మాజీ కార్పొరేటర్ చొప్పా నాగరాజు, కార్పొరేటర్ ముత్యాలు

అగనంపూడి: కళాకారులకు గుర్తింపునివ్వడంతో పాటు వారిని ప్రోత్సహించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ కార్పొరేటర్ చొప్పా నాగరాజు, 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలు అన్నారు. 88వ వార్డు వెదుళ్లనరవ ముత్యాలమ్మ అమ్మవారి జాతర సందర్భంగా కడప సత్యసాయి కళామండలి ఆధ్వర్యంలో భక్త చింతామణి నాటకం ప్రదర్శించారు. ఈ సందర్భంగా చింతామణి పాత్రధారిణి సువర్ణకు అష్టకంకణం కందుకూరి పురస్కారం, మహానటి సావిత్రి బిరుదాంకితురాలు జి. రత్నశ్రీని ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ, పౌరాణిక నాటకాలు, కళాకారులు కనుమరుగయ్యే పరిస్థితి ఉందని, వారిని ఆదుకోవడానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. కళాకారిణి రత్నశ్రీ మాట్లాడుతూ, తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా వివిధ రాష్ట్రాల్లో మూడు వేలకు పైగా నాటకాలు ప్రదర్శించానని, చింతామణి, సత్యభామ, చంద్రమతి పాత్రల్లో నటించడంతోపాటు కొన్ని సినిమాల్లో కూడా నటించానని తెలిపారు. కళాకారులను ఈ విధంగా గుర్తించి సత్కరించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సర్వసిద్ధి బొరయ్యనాయుడు, విందుల వరహాలు, బలిరెడ్డి సత్యనారాయణ, మోటూరి వెంకటరమణ, సారిపల్లి అన్నాజీరావు, పోలారావు, సీతయ్య పాల్గొన్నారు.

నీటి నిల్వలతో ప్రమాదం



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్

కంచరపాలెం: జీవీఎంసీ జోన్–5 జ్ఞానాపురం పరిధి జోనల్ కార్యాలయంలో మలేరియా విభాగంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా తదితర సీజనల్ వ్యాధుల నివారణపై గురువారం మలేరియా ఇన్‌స్పెక్టర్ నల్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్ అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ విధుల్లో సమయపాలన పాటించాలని, తమ వార్డుల్లో ఉన్న ప్రజలతో మాట్లాడి సీజనల్ వ్యాధుల వల్ల కలిగే అనర్థాల గురించి వివరించాలని తెలిపారు. యాంటీ లార్వా ఆపరేషన్‌ను పక్కాగా నిర్వహించాలని, ఇళ్లలో వాటర్ కంటైనర్లతో పాటు నీటి నిల్వలను గుర్తించి వాటిని తొలగించాలన్నారు. డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వ్యాధులు కలగజేసే దోమలను నిర్మూలించాలని పేర్కొన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం, ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయించాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ (ఎస్ఎస్) జనార్దన్, మలేరియా సూపర్‌వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే జ్ఞానం

మల్కాపురం: చిన్నారులు పుస్తకాల కంటే మొబైల్ ఫోన్‌లపై ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారని, అధికంగా మొబైల్ చూడటం కళ్ల సమస్య రావడమే తప్ప జ్ఞానం రాదని 61వ వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జి సోమేష్ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.పుస్తకాలు చదవడం వల్ల మనకు తెలియని జ్ఞానాన్ని సంపాదించుకోగలమని చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి అజయ్ కుమార్, శంకర్ రావు, ఉమామహేశ్వర రావు, సన్యాసిరావు, కృషారాణి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అశ్రద్ధ వద్దు



మాట్లాడుతున్న ఏఎంహెచ్‌వో అప్పలనాయుడు

గోపాలపట్నం: సీజనల్ వ్యాధుల పట్ల ఉద్యోగులంతా అప్రమత్తంగా ఉండాలని ఏఎంహెచ్‌ఓ బండారు అప్పలనాయుడు అన్నారు. జోన్–8 కార్యాలయంలో మలేరియా విభాగం ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన దిశా నిర్దేశం చేశారు. జోన్ పరిధిలోని వార్డు సూపర్ వైజర్లు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. రానున్న వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా వంటి విష జ్వరాలు ప్రబలకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని ఆయన తెలిపారు. మురుగు నిల్వ ఉండకుండా, దోమలు పెరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వార్డుల్లో ఇబ్బందికర పరిస్థితులు ఉన్న ప్రాంతాలను గుర్తించాలని ఆదేశించారు. ఫీల్డ్‌లో ఉన్న సిబ్బంది జ్వరాలు ఉన్నవారిని గుర్తించి, వారికి తగిన సహకారం అందిస్తూ సూచనలు ఇవ్వాలని చెప్పారు. వారి ఇంటి పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ వెంకటరమణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉగ్రవాద చర్యలను తిప్పికొట్టాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఆక్టోపస్ అడిషనల్ ఎస్పీ రాజారెడ్డి

మల్కాపురం: దేశం నలుమూలలా విధ్వంసం సృష్టించడానికి ఉగ్రవాద సంస్థలు ప్రయత్నిస్తున్నాయని, అలాంటి ఉగ్రవాద చర్యలు తమ సమీపంలో జరిగితే వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవాలని ఆక్టోపస్ అడిషనల్ ఎస్పీ రాజారెడ్డి సూచించారు. హెచ్‌పీసీఎల్ సంస్థ ఆవరణలో ఆక్టోపస్ ఆధ్వర్యంలో ఉగ్రవాద చర్యలను ఎలా ఎదుర్కోగలమనే అంశంపై గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. మాక్‌డ్రిల్ అనంతరం అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మన పిరికితనం ఉగ్రవాదులకు ఆయుధం లాంటిదని అన్నారు. తమ చుట్టుపక్కల ప్రాంతాలలో ఉగ్రవాద చర్యలకు పాల్పడే అనుమానితులు సంచరిస్తుంటే, అనుమానం వచ్చిన వెంటనే దగ్గరలోని పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అలాగే వారి కదలికలను నిరంతరం పరిశీలిస్తూ ఉండాలని కోరారు. భారత సైన్యంతో పెట్టుకుంటే ఉగ్రవాదులకు ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో పలుమార్లు రుచి చూపించామని ఆయన అన్నారు. దేశ ప్రజల సంక్షేమానికి, దేశంలో శాంతి వాతావరణం నెలకొల్పడానికి తాము ఎల్లప్పుడూ కృషి చేస్తామని తెలిపారు. మీలో ఒక్కరిలా ఉగ్రవాదులు కలిసిపోవచ్చని, కాబట్టి అనుమానితులపై నిఘా ఉంచాలని సూచించారు. దేశం కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఉగ్రవాద దాడులను తిప్పికొట్టే సన్నివేశాలు అక్కడ ఉన్నవారిని బాగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ హర్షభ్‌దేవాన్, ఆక్టోపస్ డీఎస్పీ కె.శ్రీనివాస్, మల్కాపురం సీఐ విద్యాసాగర్‌తో పాటు మెడికల్, రెవెన్యూ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఈసెట్‌లో అదరగొట్టారు



సాయి సుదర్శిని, 4వ ర్యాంకు, అగ్రికల్చరల్



మాధవి శ్రీలేఖ, 8వ ర్యాంకు, కెమికల్ ఇంజనీరింగ్

గోపాలపట్నం : ఏపీఈసెట్‌లో గోపాలపట్నం ప్రాంతానికి చెందిన విద్యార్థులు సత్తా చాటారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. గోపాలపట్నం దరి వెంకటాపురానికి చెందిన యల్లపు సాయి సుదర్శిని అగ్రికల్చరల్‌లో 4వ ర్యాంకు, గోపాలపట్నం, లక్ష్మీనగర్ ప్రాంతానికి చెందిన మాధవి శ్రీలేఖ కెమికల్ ఇంజనీరింగ్‌లో 8వ ర్యాంకు సాధించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, ప్రణాళికాబద్ధంగా చదవడం వల్ల మంచి ర్యాంకు సాధించామని విద్యార్థినులు తెలిపారు. బీటెక్‌లో కష్టపడి చదివి మంచి స్కోర్ సాధిస్తామని పేర్కొన్నారు. ఉన్నత ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రుల కల నెరవేరుస్తామన్నారు.

17 నుంచి ఆయుర్వేద వైద్య శిబిరం



డాక్టర్ కె.ఎం.ఉన్నికృష్ణన్

మహారాణిపేట: ఆయుర్వేద పంచకర్మ విధానం ద్వారా దీర్ఘకాల రోగాలకు చికిత్స అందించేందుకు ఈనెల 17 నుంచి 21 వరకు కేరళకు చెందిన ప్రసిద్ధ వైద్యులచే ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్టు కేరళ ఆయుర్వేద కేంద్రం వైద్యరాజ్ ఔషధాలయ మేనేజర్ దినూప్ తెలిపారు. ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ కేఎం ఉన్నికృష్ణన్ నాయర్ ఐదు రోజుల పాటు ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. హైపర్ టెన్షన్ (ఆందోళన), ఆర్థరైటిస్ (కీళ్లవ్యాధులు), పక్షవాతం, నడుం నొప్పి, స్పాండిలైటిస్, మానసిక వత్తిడి, నిద్రలేమి, రుమాటిజం వంటి సమస్యలతో బాధపడే వారికి ప్రత్యేక వైద్య శిబిరంలో డాక్టర్ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. 17,18,19 తేదీల్లో మురళీనగర్‌లోనూ, 20, 21 తేదీల్లో రామ్‌నగర్‌లో డాక్టర్ అందుబాటులో వుంటారన్నారు. అపాయింట్మెంట్ కోసం రామ్‌నగర్‌లోని జీవీఎంసీ గేటు ఎదురు లైన్‌లో లేదా మురళీనగర్ శ్రీదేవి పార్క్ వద్ద గల తమ కేంద్రాల్లో సంప్రదించవచ్చన్నారు. 8008000670 నంబర్‌లో అందుబాటులో ఉంటారని తెలిపారు.